క్లుప్తంగా

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



ధర్మపురి: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సీఐ రమణమూర్తి అన్నారు. మల్యాలపోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించి నూతనంగా ధర్మపురి సీఐగా బదిలీపై వచ్చారు. గురువారం పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రానికి సీఐగా రావడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలకు అధిక నిధులు



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలకు అధిక నిధులు కేటాయించి అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని విట్టంపేటలో గురువారం నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఆర్డీవో వినోద్ కుమార్, ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ ఆకుల రాజిరెడ్డి అధికారులు, నాయకులు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

మల్యాల: వరి సాగుకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిసారించాలని దీనికి ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని మల్యాల ఏవోఈ కారుణ్యకుమార్ తెలిపారు. మొక్కలకు, డ్రిప్ పరికరాలకు 90శాతం రాయితీ ఉందని, ప్రకృతి వైపరీత్యాల నుంచి కూడా ఆయిల్ పామ్ తట్టుకుని అధిక దిగుబడినిస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగును కంపెనీ ప్రతినిధులే ఒప్పందం చేసుకుని, కొనుగోలు చేస్తారన్నారు. ఆసక్తిగల రైతులు 8886523548 నంబర్‌లో సంప్రదించాలని ఏవో తెలిపారు.

ఎంపీవోను నిలదీసిన రైతులు



వేములకుర్తిలో ఎంపీవోను నిలదీస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామంలో గురువారం పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా ఎంపీవో కృపాకర్‌ను జీపీ కార్యాలయం వద్ద రైతులు నిలదీశారు. గ్రామంలో రైతుల పంట పొలాలకు నీరందించే కాలువలలో పూడికతీయాలని పలుసార్లు పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీవో కృపాకర్ మాట్లాడుతూ.. ఉపాధికూలీలతో కాలువలో పూడిక తీతకు ఎస్టిమేట్ తయారుచేశామని త్వరలోనే పనులు పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు.

పిల్లలపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి మహేశ్

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధవహించాలని దీంతో మంచి ఫలితాలు వస్తాయని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి మహేశ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. బడిబాటలో విద్యార్థుల నమోదును, ఇప్పటివరకు చేసిన అడ్మిషన్లు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలపంపిణీ, సమదుస్తుల పంపిణీ, మధ్యాహ్న భోజనం, గ్రీన్‌బోర్డ్స్, ఇన్‌స్టాలేషన్, టీవీ ఇన్‌స్టాలేషన్, మన ఊరి మనబడి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం ఎం.గణేశ్, ఉపాధ్యాయులు మోహన్, కవిత, శ్రీదేవి, మమత, శ్రీలత, పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

జగిత్యాలరూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో గురువారం టీఆర్‌నగర్‌లోని మూడు పోలింగ్ కేంద్రాల్లో రూరల్ తహసీల్దార్ నవీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌స్టేషన్లకు ఓటర్లు వెళ్లేందుకు ర్యాంపులు, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్, తాగునీటి వసతులపై పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆర్ఐభూమయ్య పాల్గొన్నారు.

వరదకాలువ నీరు చెరువులకు చేరేదెప్పుడో?

- ఎత్తిపోతలకు ప్రతిపాదనలు పంపించినా పురోగతి శూన్యం
- పనుల ప్రారంభానికి ఎదురుచూస్తున్న కథలాపూర్, మేడిపెల్లి రైతాంగం



తాండ్రియాల ఊర చెరువులో అడుగంటిన నీరు



కథలాపూర్ శివారులో ఎస్సారెస్పీ వరదకాలువ

కథలాపూర్: కాళేశ్వరం రివర్స్‌పంపింగ్‌తోపాటు ప్రతీ ఏటా కురుస్తున్న వర్షాలతో ఎస్సారెస్పీ వరదకాలువకు జలకళ సంతరించుకుంది. వరదకాలువకు తూములు ఏర్పాటు చేయడంతో దిగువనున్న పలు గ్రామాల్లోని చెరువులకు నీళ్లు చేరుతున్నాయి. కానీ వరదకాలువకు ఎగువనున్న గ్రామాల చెరువులకు మాత్రం చుక్కనీరు అందని పరిస్థితి నెలకొంటుంది. వరదకాలువకు ఎగువనున్న గ్రామాలకు నీరందించడానికి ఎత్తిపోతలే మార్గమని అధికారులు సర్వేలుచేసి ప్రతిపాదనలుపంపించినా ఆమోదంలేక కథలాపూర్, మేడిపెల్లి మ ండలాల్లోని రైతులు నిరాశ చెందుతున్నారు. తమ గ్రామశివారులోని చెరువులు నిండాలంటే వర్షధార మే మార్గమని, ఈఎత్తిపోతల పనులకు మోక్షం ఎ ప్పుడు కలుగుతుందోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వరదకాలువ ప్రవహించే గ్రామాలివే

కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో సుమారు 150 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఎస్సారెస్పీ వరదకాలువ మాత్రం కథలాపూర్ మండలంలో పెగ్గెర్ల, కథలాపూర్, దుంపేట, దూలూర్, తక్కళ్లపెల్లి గ్రామాల మీదుగా మేడిపెల్లి మండలంలో మన్నెగూడెం, దమ్మన్నపేట, రంగాపూర్, బీమారం, కాచారాం, విలయాతబాద్ గ్రామాల మీదుగా వెళ్తోంది. వరదకాలువ నుంచి ఆయా గ్రామాల చెరువులను నింపేందుకు ఇప్పటికే తూములను అధికారులు నిర్మించారు. ఈ తూములు వరదకాలువకు దిగువన ఉండడంతో కొన్ని గ్రామాల చెరువుల్లోకి నీళ్లు చేరుతున్నాయి. వరదకాలువకు ఎత్తునున్న గ్రామాల చెరువులకు నీళ్లు చేరకపోవడంతో ఎత్తిపోతల ద్వారానే నీళ్లందిస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటించి నెలలు గడుస్తున్నా పనులకు మోక్షం కలగకపోవడంతో ఈ వానకాలం సీజన్‌లో పంటలకు నీళ్లందడం కష్టమేనని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ. 700 కోట్లతో ప్రతిపాదనలు

కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో వరదకాలువకు ఎగువనున్న గ్రామాల చెరువులు నింపేందుకు ఎత్తిపోతలే మార్గమని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు భావించారు. దీంతో అధికారులు పలు సర్వేచేశారు. వరదకాలువ నుంచి నీళ్ల చెరువులకు ఎత్తిపోసేందుకు కథలాపూర్ మండలంలో రెండు, మేడిపెల్లి మండలంలో మూడు పంపింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందుకు సుమారు రూ.700 కోట్లు నిధులు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు నివేదిక రూపొందించారు. ప్రతిపాదనలను ఏడాది క్రితమే ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికి మోక్షం లభించకపోవడంతో రైతులు నిరాశచెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఎత్తిపోతల పనులు త్వరగా ప్రారంభించేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

జాప్యం వద్దు



మా ఊరికి తుమ్మల చెరువు, బొమ్మెన ప్రాజెక్టు ప్రధానం. వర్షం కురిస్తేనే తుమ్మల చెరువు, బొమ్మెన ప్రాజెక్టు నిండుతుంది. ఊరికి సమీపంలోనే వరదకాలువ ఉంది. వరదకాలువ నీళ్లతో చెరువులను నింపుతామని ఏళ్లుగా చెబుతున్నా అధికారులు ఇప్పటికి పట్టించుకుంటలేరు. రైతులంటే ప్రభుత్వానికి పట్టింపు కరువైంది. రైతుల సంక్షేమంను దృష్టిలో పెట్టుకుని చెరువులను నింపే పనులు త్వరగా ప్రారంభించాలి.

– దేవారెడ్డి, రైతు, బొమ్మెన, కథలాపూర్

రైతులను మభ్యపెడుతున్నరు



వరదకాలువ నుంచి ఎత్తిపోతలతో రెండు మండలాల్లోని చెరువులను నింపుతామని స్వయంగా సీఎం కేసీఆర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రకటించారు. ఏడాదైనా పనుల్లో పురోగతి లేదు. ఎత్తిపోతల పేరుతో రైతులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారు. నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పనులు త్వరగా ప్రారంభించి బీఆర్‌ఎస్ ప్రభు త్వం చిత్తశుద్ధిని చాటుకోవాలి.

– ముంజ శ్రీనివాస్‌గౌడ్, మేడిపెల్లి

ప్రతిపాదనలు పంపించాం

కథలాపూర్, మేడిపెల్లి మండలాల్లో వరదకాలువకు ఐదు నీటి పంపింగ్ పనుల కోసం రూ. 700 కోట్లతో ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపించాం. శాఖపరంగా పరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక చేరింది. పరిపాలన అనుమతి వచ్చి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. రైతులు సమన్వయం పాటించాలి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రైతులు ఇబ్బందులు తొలగిస్తాం.

– గంగాధర్, ఎత్తిపోతల విభాగం ఏఈ

గ్రామగ్రామాన 'పల్లె ప్రగతి' దినోత్సవం



మైతాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ



జీపీ సిబ్బందిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ లావణ్య



కార్మికురాలిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ బాదినేని

కోరుట్లరూరల్/పెగడపల్లి/కథలాపూర్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/బుగ్గారం/రాయికల్/సారంగాపూర్: సీఎం కేసీఆర్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల వ్యాప్తంగా అన్ని జీపీ కార్యాలయాల్లో పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులతో సాధారణ సమావేశాలు నిర్వహించి పల్లెప్రగతిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, నిధుల వివరాలు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. పల్లెప్రగతిలో అందించిన ట్రాక్టర్లను అలంకరించి గ్రామాల్లో తిప్పారు. పల్లెప్రగతి ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో ర్యాలీలు తీశారు. గ్రామాల పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్మికులను సన్మానించి ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పల్లెప్రకృతివనం, నర్సరీ, కంపోస్టుషెడ్, డంపింగ్‌యార్డు, శ్మశానవాటికలు, క్రీడామైదానాలను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సందర్శించారు.

జువ్వాడి సతీమణి మృతికి మంత్రి సంతాపం

- అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి కొప్పుల



సంతాపం వ్యక్తం చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావ్ సతీమణి జువ్వాడి సుమతి దేవి అకాల మరణంపై మంత్రి కొప్పుల ఈశ్వర్ చింతిస్తూ సంతాపంతెలిపారు. హైదరాబాద్‌లో మృతిచెందిన రత్నాకర్‌రావ్ సతీమణి పార్థివ దేహాన్ని వారి స్వగ్రామమైనా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు జరిపారు. అంత్యక్రియల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, హరిచరణ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. విషయం తెలిసిన వెంటనే జనం తండోపతండాలుగా తరలివచ్చారు. రత్నాకర్‌రావ్ కుమారులు జువ్వాడి నర్సింగరావ్, నవనీతకృష్ణారావ్, చంద్రశేఖర్‌రావ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఓట్లు దండుకునేందుకే కులవృత్తుల పథకం



కోరుట్ల: రాష్ట్రప్రభుత్వం కులవృత్తుల పేరిట ప్రవేశపెట్టిన రూ. లక్ష పథకం ఓట్లు దండుకునేందుకేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ ఆరోపించారు. ఈమేరకు పట్టణంలో గురువారం మాట్లాడుతూ.. ప్రభుత్వం నిజంగా కులవృత్తులకు సాయం చేయాలనుకుంటే బీసీ సామాజిక వర్గాల్లోని అన్ని కులాలకు ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. ఈ పథకం కొన్ని సామాజిక వర్గాలను తమవైపు తిప్పుకునేందుకు ప్రవేశపెట్టిన ఎన్నికల స్టంటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ కులాల్లోని అన్ని కులవృత్తులకు ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీసరి నర్సయ్య, ఎర్ర రాజేందర్, తిరుమల వాసు, పోతుగంగి శ్రీనివాస్,గిన్నెల అశోక్, పోరుపాక రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై బురదజల్లడం సరికాదు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు

ధర్మపురి: గతంలో ఏప్రభుత్వాలు చేయని అభివృద్ధిని ధర్మపురిలో చేసి చూపించామని అయినా ఓర్వలేక బీఆర్‌ఎస్‌పై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని పట్టణ అభివృద్ధిపై ఏ చర్చకైనా సిద్ధమేనని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్‌చైర్మన్ రామన్న సవాల్ విసిరారు. ధర్మపురి పట్టణంలో ఇటీవల మిషన్ భగీరథ ద్వారా నీరందించడం లేదని అందుకు నిరసనగా గోదావరి నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు జలాలను తెచ్చి తెలంగాణ తల్లికి పాదాలు కడగడం చర్చాంశంగా మారింది. ఈ విషయంపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2009 నుంచి మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో రూ.కోట్లాది నిధులు మంజూరు చేస్తున్నారని కొందరు ఓర్వలేక కోర్టుల నుంచి స్టే తెస్తూ అభివృద్ధికి అడ్డు పడుతున్నారన్నారు. ధర్మపురిలో ఎన్ని నీటి ట్యాంకులున్నాయి ఏఏ ట్యాంకు ద్వారా ఏఏ వార్డులకు నీరందిస్తున్నాం, సాంకేతిక లోపాలతో ఏఏ రోజుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలిగిందనే అంశాలకు ముద్రించిన ప్రతులను సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులున్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు బీమా సౌకర్యం



మల్యాల: పల్లెప్రగతిదినోత్సవం సందర్భంగా మల్యాల సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ ప్రత్యేక చొరవతో మల్యాల జీపీ పారిశుధ్య కార్మి కులకు బీమా సౌకర్యం కల్పించారు. ఈమేరకు గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు పాటుపడుతున్న పారిశుధ్య కార్మికుల పేర్లపై స్థానిక పోస్టాఫీసులో బీమా మొత్తం చెల్లించి, మల్టీపర్పస్ వర్కర్లను శాలువాలతో సన్మానించి, బీమా పత్రాలు అందించారు. బీమా సౌకర్యం కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ సుదర్శన్, కార్యదర్శి గుండేటి రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి గుండేటి రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి గౌడసంఘం సభ్యుల సన్మానం

- రైతుబీమా నియమాలు గీతబీమాకు వర్తింపజేయాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పుష్పగుచ్ఛం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

జగిత్యాలటౌన్: బెల్టుషాపులతో ప్రభుత్వం గీత కార్మికుల ఉపాధికి గండికొడుతోందని, ప్రమాదవశాత్తు చనిపోతేనే గీత కార్మికులకు బీమా వర్తిస్తోందని రైతులు ప్రమాదవశాత్తు మరణించినా, అకాల మరణం చెందిన బీమా వర్తిస్తోందని రైతుల మాదిరిగానే అకాల మృతిచెందిన గీత కార్మికులకు గీతబీమా వర్తింపచేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. జగిత్యాల, మోతె, తిమ్మాపూర్ గౌడ సంఘాల నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులను ఎమ్మెల్సీ శాలువాతో సన్మానించి మాట్లాడారు. కులవృత్తులకు రూ.లక్ష సాయం అందిస్తున్న ప్రభుత్వం కేవలం 10 శాతం మందికి ఇచ్చి 90శాతం బలహీనవర్గాలను విస్మరిస్తోందన్నారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులకు రూ. లక్ష సాయం అందించాలన్నారు. గౌడ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జగిత్యాల గౌడ సంఘం అధ్యక్షుడు పంజాల తిరుపతిగౌడ్, ఉపాధ్యక్షుడు కాసారపు భాస్కర్, మోతె సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ల రామకృష్ణగౌడ్, తిమ్మాపూర్ సంఘం అధ్యక్షుడు సాసారపు కిషన్‌గౌడ్ తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

రాయికల్: మండలంలోని మైతాపూర్‌లో రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గోపి రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



చిన్నారులతో డ్యాన్స్‌చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో గురువారం ఘనంగా పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుల చప్పుళ్ల మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం వనభోజనాలు చేశారు.

ఎమ్మెల్యే పూజలు..

జగిత్యాలరూరల్ మండలం తక్కళ్లపల్లి, అనంతారం గ్రామాల్లో బుధవారం జరిగిన పోచమ్మతల్లి బోనాల పండగలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోచమ్మతల్లి ఆలయం వద్ద రూ.2 లక్షలతో నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. సర్పంచ్ జైపాల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊరి దేవతలకు బోనాలు

జగిత్యాలఅగ్రికల్చర్: రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్తులు కులమతాలకు అతీతంగా ఊరి దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామస్తులు డప్పుచప్పుళ్ల మధ్య, గ్రామం చుట్టూ ఉన్న పోచమ్మ, బంగారు పోచమ్మ దేవతలకు నైవేద్యంతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

మహాలక్ష్మి అమ్మవారికి బోనాలు

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్‌లో మహాలక్ష్మీదేవి అమ్మవారికి గురువారం గ్రామానికి చెందిన మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బోనాలతో వెళ్తున్న మహిళలతో శోభయాత్రలో పాల్గొని చిన్నారులతో కలిసి స్టెప్పులేసి ఉత్సాహపరిచారు. అనంతరం మహాలక్ష్మీ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.2 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయకమిటీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

కొత్తదాంరాజుపల్లిలో పోచమ్మ బోనాలు

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, మహిళలు ఊరేగింపుగా డప్పుచప్పుళ్ల బోనాలతో తరలి వచ్చి పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

నీట్‌లో ధర్మపురికి వాసికి ఆలిండియా ర్యాంకు



ధర్మపురి: ఇటీవల విడుదలైన నీట్‌పరీక్ష ఫలితాల్లో ధర్మపురి వాసిఆలిండియాలో 1200 ర్యాంకు సాధించాడు. జగిత్యాల జిల్లా ధర్మపుకి చెందిన కూరగాయల రమేశ్ శైలజా దంపతుల కుమారుడు శ్రీనిథ్ మే 7న మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించేందుకు నీట్ పరీక్షరాసి 720 మార్కులకు 634 మా ర్కులు సాధించాడు. శ్రీనిథ్ ఇంటర్‌లో 1000 మా ర్కులకు 986 మార్కులు అదేవిధంగా ఇటీవల 15 రోజుల క్రితం విడుదలైన ఎంసెట్‌లో స్టేట్ ఫలితా ల్లో 354 ర్యాంకు సాధించాడు. నీట్ ఫలితాల్లో ర్యాంకు సాధించిన శ్రీనిథ్ విజయంపై పట్టణ ఆర్యవైశ్యు లు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రోల్లవాగు ప్రాజెక్టు గుట్టలపై గురువారం గిరిజన ఆరాధ్య దైవం భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గతంలో భీమన్న ఆలయం రోల్లవాగు ప్రాజెక్టులో ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే దశకు చేరడంతో ఆలయం నీటిలో మునిగే పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజన నాయకులు స్వామివారిని రోల్లవాగును ఆనుకుని ఉన్న గుట్టపైకి తీసుకువచ్చి అక్కడ చిన్న ఆలయం నిర్మించారు. ఈ క్రమంలో బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకుడు మధుకుమారాచార్యులు భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపనచేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, విండోచైర్మన్ పొల్సాని నవీన్‌రావు, నాయకులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రంగవల్లుల పోటీలు

కోరుట్ల: దశాబ్ది వేడుకల్లో భాగంగా గురువారం మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో ర్యాలీతీశారు. విజేతలకు మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య బహుమతులు అందించారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఆయాజ్ అధికారులు, పాల్గొన్నారు.

ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు త్వరగా అందించాలి

ధర్మపురి: బీసీలకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేయడంలో జాప్యం లేకుండా త్వరగా అందించాలని కాంగ్రెస్ నాయకులు గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కులవృత్తులు చేసుకునేవారు వెనుకబడిన కులాల వారికి రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష రుణం అందిస్తామనడంతో దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం నిరీక్షిస్తున్నారన్నారు ఈనెల 20 చివరి తేదీ కావడంతో ధ్రువపత్రాలను త్వరగా అందించాలని వినతిపత్రంలో పేర్కొనారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్ తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

కోరుట్ల: పట్టణంలోని బ్రాహ్మణ ఆర్థిక సమాఖ్య ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన బ్రాహ్మణ విద్యార్థులకు గురువారం ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా శాలువాలతో సన్మానించి ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో పాలెపు జయరాము శర్మ, అరుణ్ శర్మ, శంకర్ శర్మ, ప్రవీణ్ కుమార్, రమేశ్ శర్మ, ఫణీంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆసరా

జగిత్యాల: జిల్లాలోని వయోవృద్ధుల సమస్యల పరిష్కారంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లాశాఖ ఆసరాగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కార్యాలయంలో వయోవృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో వయోవృద్ధులకు సేవలందిస్తున్న వారిని సన్మానించి మాట్లాడారు. తల్లిదండ్రులు పట్టించుకోని వారికి అనేక శిక్షలున్నాయని, ఎవరైనా ఇబ్బందులుంటే ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, జీఆర్‌దేశాయి, హన్మంతరెడ్డి, యాకూబ్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

జగిత్యాల: వైద్యశాఖలో సెకెండ్ ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న సునీత మృతిచెందడం బాధాకరమని, తెలంగాణ ఉమెన్ ఏఎన్‌ఎంల సంక్షేమ మండలి అధ్యక్ష, కార్యదర్శులు మధురిమ, మమత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సునీత అనారోగ్యానికి గురై మృతిచెందిందని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సునీత కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.